

# నేరేళ్ళ మస్తాన్ సురేష్ నా దేవుడు...

....అని నేను చెప్తా ఉన్నానంటే అట్టాంటి 'పీరు' నిజ్జంగానే ఉండాడనీ, యీ పీరు దర్గా మా జిల్లాలో యాణ్ణో ఒకదిక్కడ ఉండే ఉంటుందని అనుకునేరు సామీ...

అట్టాంటిదేమీ లేదు.

నేరెళ్ల మస్తాన్ సురేష్ అంటే మా యిస్కూల్లో నా క్లాస్‌మేటు. గుడ్డలాపారం చేసే శెట్టిగార్ల పిల్లోడు. వాడు నాకు దేవుడు ఎట్టయినాడో చెప్పే ముందు... చిన్నప్పుడు నాకొచ్చిన డౌటే మీకూ రాకుండా... వాడి పేరులో 'మస్తాన్' ఎట్టొచ్చిందో చెబుతా.

మా నెల్లూరు జిల్లాలో పెద్ద దర్గాలు... ఎవరికి ఏ కష్టమొచ్చినా సుకమొచ్చినా ఉసుక్కుమని పరిగెత్తే దర్గాలు రొండే రొండు. ఒకటి: నెల్లూరుకు దగ్గిరగా కసుమూరులో ఉండే 'కాలీషావలీ పీరు' దర్గా. రొండు: ఆత్మకూరు పక్కన్నే అన్న సముద్రం పేటలో ఉండే 'హజరత్ పీరు' దర్గా.

శుక్కురోరాలప్పుడు, సెలవలప్పుడు మాబోటోళ్లం వస్తాపోతా నిద్దర్లు చేస్తాగీస్తా ఉండే

యీ దర్గాలకు 'ఉర్సు'లొచ్చినాయంటే మా జిల్లావోళ్లకే గాకుండా చుట్టుపక్కల జిల్లాల వోళ్లకు కూడా మొక్కులు మొక్కుకునే, మొక్కులు తీర్చుకునే సీజను వచ్చిందన్నమాటే.

పిలకాయలు పుట్టలేదనీ, ఆరోగ్యాలు బాగుండటం లేదనీ, యాపారాలు కలిసి రావడం లేదనీ ఒకొకొరు ఒకో మేలు కోరతా దర్గాల మీద పూల దుప్పట్లు పరిచి మొక్కులు మొక్కుకుంటా వుంటారు. దీనికి హిందువులు, ముసల్మానులు అనే బేదం లా. ఎవురికైనా ఒకటే నమ్మకం.

ఆ నమ్మకంతోటి పుట్టినోడే నేరేళ్ల మస్తాన్ సురేష్‌గాడు.

వీళ్ల నాయిన నేరేళ్ల సుబ్బారావు 'కసుమూరు' దర్గాకు పొయ్యొచ్చినప్పుడు వీడు పుట్టినాడంట. అందుకని చెప్పి వీడి పేరు మద్యలో 'మస్తాన్' వచ్చేలా చేసి 'మస్తాన్ సురేష్' అని పెట్టుకున్నాడు. (కసుమూరు కాలేషా వలికి 'మస్తాన్ వలీ' అనే యింకో పేరుంది. మా జిల్లాలో ఈయన మొక్కుతో పుట్టిన బిడ్డలకు 'మస్తాన్', 'కాలేషా' అనే పేర్లు పెడతా వుంటారు. మా జిల్లా హిందువుల్లో మస్తాన్ రెడ్డి, మస్తాన్ రావు, మస్తానయ్యలాంటి పేర్లు కొల్లగా అవుపిస్తా వుంటాయి. అదేవిదంగా అన్నసముద్రం పేట 'హజరత్ పీరు' మొక్కుతో పుట్టిన బిడ్డల్ని హజరత్ రెడ్డి, హజరతయ్య అనే పేర్లతో పిలస్తా వుంటారు).

మస్తాన్‌వలీ మొక్కు పుణ్యమా అని మస్తాన్ సురేష్‌గాడు పుట్టనయితే పుట్టినాడుకానీ వాడి కడుపున అక్షరమ్ముక్క పుట్టలా. నేనే మొద్దుననుకుంటే నాకన్నా మొద్దుగా తయారయిపొయినాడు మా కిలాస్‌లో. అదీగాక మా యింటి పేరు 'ఎం.డి', వీళ్లింటి పేరు 'ఎన్.ఎం' అయ్యే సరికి రిజిష్టర్లో మా పేర్లూ నంబర్లూ పక్కపక్కన్నే అయ్యి మేమిద్దరం సచ్చినట్టుగా పక్కసక్కనే కూచొని యూనిట్ టెస్టులు రాయాల్సి వచ్చేది.

సరిగ్గా యీ పాయింటు దగ్గర పండింది నా పంట.

ఒక్క లెక్కల్లో తప్పితే తక్కిన అన్ని టెస్టుల్లో సాద్యమైనంత సొంత కవిత్వం కలిపి (లెక్కల్లో సొంత కవిత్వం కలపడం అనేదే వుండదు. మనకు తెలిస్తే లెక్కెయ్యాలి. లాకుంటే పెన్ను కొరుక్కుంటా గమ్మున కూచోవాలి. అంతే) అన్నీ కొస్నెలకూ ఎట్నోకట్ట ఆన్సర్లు రాసేవాణ్ణికానీ సురేషుగాడికి ఆ న్యాక్ తెలిసేది కాదు. కొత్తఅట్టకు రెండు తెల్లతావులు తగిలించుకొని, నీటుగా మార్జిన్లు గీసుకొని, తెల్లమొకంతో దిక్కులు చూస్తా కూచునేవాడు.

ఎప్పుడైనా వాడు మా క్లాసవర్లని గిరి, గిల్లి 'చూపీరా... ప్లీజ్‌రా' అని గుసగుసగా అడిగితే ఆ నాయాళ్లు తుస్కారంగా మొకం పెట్టి 'చూపిస్తే రమాదేవి టీచరు కొడ్తుందయ్యా' అనేవాళ్లేగానీ పాపమని తలిచి అక్షరమ్ముక్క కూడా చూపించేవాళ్లు కాదు. యింకొందరైతే

ఇంటర్‌బెల్లప్పుడు సురేషుగాడు యిప్పించే పీసుమిఠాయికాడ (ఫ్రెండ్ షిప్పు చెడిపోకుండా వుండేందుకు 'చూసుకోరా' అని ఆన్సరు పేపర్ని సైడుకు పెట్టేవాళ్లుకానీ వీడు రాసుకునే లోపలే 'ష్... టీచర్ వస్తా వుంది' అని వూరకనే అని, మళ్లా మూసేసుకునే వాళ్లు. దాంతో మనోడు సగం రాసి సగం రాయక తనకలాడిపోయేవాడు పాపం.

వీడి తనకలాట మరుసటి రోజున యింకాస్త ఎక్కువగా వుండేది- దిద్దిన పేపర్లని తిరిగి తీసుకునేటప్పుడు.

మా టీచర్లు మా పేపర్లని ఊరకనే యివ్వరు. మా మార్కులని పైకి చదవతా ఒక్కొక్కరినీ పిలిచి తక్కువ మార్కులు వచ్చినందుకు సావకొట్టేసే వాళ్లు. సురేష్గాడికైతే డబుల్ కోటింగు వేసేవాళ్లు. (మా రమాదేవి టీచరు మా ఆన్సరు పేపర్లని రివర్సు పద్ధతిలో యిచ్చేది. అంటే ముందు పది మార్కులు వచ్చినోళ్లకీ, ఆనేక పన్నెండు మార్కులు వచ్చినోళ్లకీ, ఆ తర్వాత పదిహేను మార్కులు వచ్చినోళ్లకీ అట్టా యిచ్చుకుంటా వచ్చి, ఆఖర్న యిరవై అయిదుకి యిరవై నాలుగు వచ్చినోడి పేపరిచ్చి వాడి గొప్పతనానికి అందరిచేతా చప్పట్లు కొట్టించేది. ఈ దోవన ఆమె పేపర్లు యిచ్చేటప్పుడు సహజసిద్ధంగానే సురేషుగాడి పేపరే ఫస్టయ్యేది- నాలుగూ లేదా గెట్టిగా మాట్లాడితే అయిదు మార్కులతో. అసలికే ఫస్టు పేపరు... దానికి తోడు పచ్చిబెత్తం రెడీ... పైగా కొట్టడానికి అలివిగానంత హుషారు... మనోడికి ఫుల్లుగా పడిపోయేది కోటింగు. వీడి తర్వాత, వీడి కంటే తక్కువ మార్కులు వచ్చిన నాబోటి వాళ్లకి దెబ్బల డోసు తగ్గతా వచ్చేది).

యీ దెబ్బల బాదకు తాళలాక, మార్కులు తెచ్చుకోలాక మస్తాన్ సురేషుగాడు చదువు అబ్బించుకునేదానికి తాయెత్తులు కట్టుకోవడం లాంటి పనులు ఏందేందో చేసేవాడు. ఒకసారి మా కావలికి దగ్గరగా 'బళ్లమ్మ' అనే దేవత వుంటే, సురేషుగాడు వాళ్ల నాయినతో కలిసి ఆమెకాడికి పోయినాడు చదువు కోసరం.

ఆమె వీడి నాలికని యింత పొడుగున బయిటికి తీయించి చూసి 'యీ దెబ్బతో నీకు చదువొస్తుందిపో' అంటా వీడి నాలిక మీద సాంబ్రాణి కడ్డీతో ఏందో మంత్రం రాసిందంట. అది రాయించుకొని వచ్చినప్పట్నించి సురేషుగాడు 'బళ్లమ్మ దేవత మంత్రం రాసిందిలేయ్యా. రెండు నెల్లు ఆగు. ఎట్టా చదువొస్తుందో చూద్దాగాని' అని అడిగినోడికీ అడగనోడికీ కూడా నాలిక చూపించడం మొదలుపెట్టినాడు.

రెండు నెల్లు గడిచినాయి. యింకో యూనిట్ టెస్టు వచ్చింది.

సేమ్ మార్కులు! సేమ్ కోటింగు!

దాంతో మనోడు తత్తరబిత్తరయిపోయి, యింక లాబం లేదనుకొని పక్కనెంబరోడ్నైన నాతోటి యాపారానికొచ్చేశాడు.

ఒకో 'డాషూ' చూపిస్తే ఐదు పైసలు. రెండు మార్కుల కొశెనుకు పది పైసలు. అయిదు మార్కుల కొశెనుకు పావల. పరీక్ష అయిపోవడంతోటే క్యాషు డౌను. అదీ లెక్క.

సురేషుగాడితో ఎప్పుడైతే యీ లెక్క కుదిరిందో అప్పట్నించి నా దశే తిరిగిపోయింది. వీడి కోసరమని యూనిట్ టెస్టు పరీక్షలకి మొత్తం పాఠాలు చదవక పోయినా టీచర్లు టిక్కు పెట్టిచ్చిన ఇంపార్టెంటు కొశ్నెల్లయినా చదువుకొని వచ్చేవాణ్ణి. అవి గుడ్డేటుగా తగిలినాయో ఒక కొశెనుకూ ఒకో పావలా సంపాదించినట్టే.

ఈ లెక్కన పరీక్షకి అర్ధరూపాయి తగ్గకుండా ఆరు సబ్జెక్టులకీ కలిపి మూడు రూపాయిలన్నా సంపాదించేవాణ్ణి నేను.

అన్ని డబ్బులంటే మాటలా? వాటితో నా జల్సా నా జషనూ ఏమని చెప్పేది? సింగు స్వీటు స్టాల్లో గులాబుజాములు యారకనూకడం, కోటమ్మ బంకులో 'వేటగాడు' 'సాహసావంతుడు' బొమ్మలు కొనుక్కొని అట్టలకు కరిపించుకోవడం, ఒక తట్టు బులిగింకు- యింకోతట్టు రెడ్డింకు వుండే 'రెండు తలకాయల పెన్ను' కొనుక్కొని మురిసిపోవడం... ఒకటని కాదులే.

యిట్టా యీ సంపాదన మరిగి నేనూ, పరీక్షల్లో దెబ్బల బాద కొంతయినా తగ్గినందుకు సురేషుగాడూ ఒకరికొకరం దగ్గరయ్యి కొన్నాళ్లకి యింకా క్లోజయిపోయినాం. పరీక్షలు వున్నా లాకపోయినా రోజూ ఒంటేలు గంటలో ఐసులూ, కమ్మర్కడ్డీలూ కొనిపెట్టేవాడు సురేషు.

వాడుండబట్టి సరిపోయింది గానీ లాకుంటే అరిచి గీపెట్టి ఎంత ఆగిత్యం చేసినా సరే ఐదంటే ఐదు పైసలన్నా విదిలించని మా అమ్మ వల్ల ఒక్క చిరుతిండైనా తినగలిగేవాణ్ణా నేను? సిలోన్ బిస్కెట్టులు, డైమండ్ బిస్కెట్టులు ఎట్టా వుంటాయో తెలిసుండేదా నాకు? నిజ్జానికి మా అమ్మ కంటే కూడా మస్తాన్ సురేషుగాడే ఎక్కవగా సాకినాడు నన్ను మా యిస్కూల్లో.

అంతేకాదు. ఒకసారి పెద్ద గండం నుంచి కూడా గట్టెక్కించినాడు నన్ను. ఆ కతను యీడ చెప్పుకోక పోతే యీ కతకు అన్యాయం చేసినోణ్ణవతాను.

ఒకతడవ ఏందో కరువచ్చినట్టుగా మా యింట్లో నయాపైసా చూళ్లేదు మేము. రోజూ మా నాయిన పనికిపోవడం, పని దొరక్క ఖాళీ జేబులతో తిరిగి రావడం... యిదే దరువు. అట్టా మూడు నాలుగు రోజులు చెట్నీతో చారుతో టీనీళ్లకి కూడా లాకుండా నకనకలాడినాక

మరుసటి రోజుకి బలే కుషీగా వచ్చినాడు మా నాయిన- జేబులో నుంచి యాభై రూపాయల నోటు తీసి బయిటికి చూపిస్తా.

దాన్ని చూట్టంతోటే మొకం చేటంత చేసుకొని 'బియ్యం తెచ్చేదా?' అంటా లేచి నిలబడింది మా అమ్మ. 'వీదిలోకి అట్టాపోయి చేపలొచ్చినాయేమో చూసొచ్చేదా అబయా' అనింది మా నాయినమ్మ.

మా నాయిన ఆ యాభై నోటును అట్టనే పట్టుకొని- 'మీరేమైనా చేసుకోండబ్బా. ఉండేది యాభై. నాకు మాత్రం ప్యాకీ సిగరెట్లు కావాలి' అన్నాడు. అన్నాక నా తట్టు చూసి 'రే... ముందర పోయి సిగరెట్లు తేపో. అట్టాగే నువ్వొక పావలాకి కొనుక్కోపో' అన్నాడు.

'పావల' అనే మాట చెవిన పడటం తోటే ఎప్పుడు యాభై అందుకున్నానో ఎప్పుడు చొక్కా జేబులో పెట్టుకున్నానోగానీ గిద్‌గిద్‌మని పరిగెత్తతా క్షణాల్లో వీది చివర బంకుకాడ తేలినాను.

చూస్తే ఏముంది? జేబు ఖాళీ!

గుండె ఆగినంత పనయ్యింది. ఒంటేలు కార్రిపోయినాయి. యాభై రూపాయిలంటే చిన్న విషయమా? 'యా పీర్... మస్తాన్ వలీ' అనుకుంటా, వచ్చిన దోవనే వేయికళ్లతో దేవులాడుకుంటా బయలుదేరినాను. కనపడితేగా? ఎక్కడెగిరిపోయిందో గాలికి.

ఏడుపొచ్చేసింది. 'యింక యింటికి ఏ మొకం పెట్టుకొని వెళ్లను' అని మస్తాన్‌వలికి దండాలు పెట్టుకుంటా, ఏడ్చుకుంటా వుంటే లటక్కన మస్తాన్ సురేషుగాడు గుర్తుకొచ్చినాడు.

ఆశ పుట్టింది. ఎమ్మటన్నే లగెత్తుకుంటా వాళ్లింటికెళ్లి 'యిట్టిట్టా సంగతిరా... డబ్బులు పోయినాయిరా' అని ఏడ్చుకుంటా చెప్పినాను. నా ఏడుపు చూసి వాడిక్కూడా బలే ఏడుపొచ్చేసింది.

'ఉండు. మా నాయిన యింట్లోకి పోనీ' అన్నాడు బరోసాగా. (వాళ్లది ముందరి తట్టు అంగడి. వెనక తట్టు ఇల్లు. ఇప్పటికీ).

కొంతసేపటికి సురేషువాళ్ల నాయిన యింట్లోకి పోంగానే గల్లాపెట్టికాడ కూచున్నట్టుగా కూచొని, సైగ్గా యాభై రూపాయిల నోటు నూక్కొచ్చి నాకిచ్చేసినాడు.

దాన్ని చూడంగానే మస్తాన్ వలీ కనిపించినంతయ్యింది నా పని.

'సామీ... సువ్వురా మస్తాన్‌వలీ అంటే. నీకురా యింక మీదట టెంకాయ కొట్టాల్సింది' అని వాడికి నమస్కారాలు చేసి, 'ఎప్పటికైనా నీ యాభై నీకిచ్చేస్తానురా' అన్నాను చేతులు

పట్టుకుంటా.

అట్టా వాడివల్ల నా గండం తీరడమే కాదు ఆ పూట మా యింట్లో పెద్ద యుద్ధం జరిగి మేమందరం పస్తులు వుండాల్సిన బాధ కూడా తప్పింది. యిది జరిగినాక మళ్లెప్పుడూ వాణ్ణి యూనిట్ టెస్టుల్లో కొసెనుకింతని డబ్బులు అడగనే లేదు నేను.

★

ఆ తర్వాత సురేషుగాడు హైస్కూల్లోనే చదువొదిలేసి యాపారాన్ని పట్టుకున్నాడు. యిప్పుడోడు 'న్యూ సత్యనారాయణ అండ్ సన్సు'కి ఏకైక ఓనరు. అయినా వాడు నా బాకీ మర్చిపోలా. కనిపించినప్పుడల్లా 'నా యాభై ఏదిరా?' అని అడగతానే వుంటాడు... నవ్వతా... ప్రేమగా.

